



సంప్రదాయ వస్త్రధారణలో యువతులు

ఉగాది వేడుకల్లో పండితులు, మంత్రి, ఎమ్మెల్యేఎమ్మెల్సీలు, మార్క్‌ఫెడ్ చైర్మన్, కలెక్టర్, జేసీ



# వ్యవసాయం బాగు.. బాగు

- సాగుకు ఈ ఏడాది కలిసివస్తుందన్న పండితులు
- పంచాంగ శ్రవణంలో వెల్లడి
- వైభవంగా ఉగాది
- ఆకట్టుకున్న సంప్రదాయ వస్త్రధారణ
- ఆలయాలూ కిటకిట

విజయనగరం రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి)


విశ్వావసు నామ సంవత్సరంలో వ్యవసాయం బాగుంటుందని, పంటలు సమృద్ధిగా పండుతాయని ఉగాది పంచాంగ శ్రవణంలో పండితులు వెల్లడించారు. దాదాపు అందరూ ఇదే అభిప్రాయాన్ని చెప్పారు. పంటలకు మంచి ధరలు కూడా దక్కుతాయన్నారు. ఈ తెలుగు సంవత్సరం రైతుకు పూర్తి అనుకూలంగా ఉందని ప్రకటించారు. కాగా తెలుగు సంవత్సరాది (ఉగాది) వేడుకలు జిల్లాలో ఆదివారం వైభవంగా జరిగాయి. ఉదయానే మామిడాకుల తోరణాలతో గృహాలను అలంకరించారు.



సంగీత కళాశాల విద్యార్థినుల గీతాలాపన

పూలతో ఇళ్లలోని దేవుని గదులను ముస్తాబు చేశాక కుటుంబాల సమేతంగా ఉగాది పచ్చడిని రుచి చూశారు. సంప్రదాయ వస్త్రధారణలతో ఆలయాలకు బయలుదేరారు. అనంతరం పంచాంగ శ్రవణాన్ని విన్నారు. రైతులు ఏరువాక చేపట్టారు. ఇక జిల్లా అధికార యంత్రాంగం కలెక్టరేట్‌లో ఉగాది వేడుకలు నిర్వహించింది. అధికారులు, ప్రజాప్రతినిధులు సంప్రదాయ వస్త్రధారణతో హాజరయ్యారు. మరోవైపు దేవదాయ శాఖ పరిధిలో ఉన్న అన్ని ఆలయాల్లోనూ పంచాంగ శ్రవణం జరిగింది. పైడిమాంబ ఆలయం, రామతీర్థం కోదండరామాలయాన్ని వందలాది మంది దర్శించారు. ఆపై పంచాంగ శ్రవణం (మిగతా 8వ పేజీలో..)

## ఆ గ్రామంలో ఏప్రిల్ 3న ఉగాది..



గజరాయునివలస గ్రామం

బొబ్బిలి/ బాడంగి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అన్నిచోట్లా ఉగాదిని ఆదివారం జరుపుకున్నారు. ఆ గ్రామంలో మాత్రం మరో రోజున నిర్వహిస్తారు. పూర్వీకుల నుంచి అక్కడ ఏరువాక ముహూర్తం నాడే ఉగాది వేడుకలను జరుపుకో వడం ఆనవాయితీ. బాడంగి మండలం గజరాయునివలస గ్రామంలో అందరిలా ఆదివారం ఉగాదిని జరుపుకోలేదు. ఏప్రిల్ 2న బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత గురువారం వేకువజామున (3న)ఉగాది జరుపుకోవాలని పెద్దలు నిర్ణయించారు. ఆ మేరకు గ్రామంలో చాటింపు వేశారు. మైకులో కూడా ప్రకటించారు. ఇదే పద్ధతిని దశాబ్దాల తరబడి పాటిస్తున్నారు. ఉగాది నాడు పంచాంగ శ్రవణం మాత్రం జరుపుతారు. అసలైన ఉగాదిని బుధవారం (ఏరువాక ముహూర్తాన) జరుపుకుంటారు. ఆ రోజు రైతులంతా కొత్త నాగళ్లతో వేకువజామున దుక్కిదున్ని గెత్తం జల్లుతారు. పూజలు చేస్తారు. పశువులను అలంకరిస్తారు. అందరూ కొత్త బట్టలు ధరించి ఆడపిల్లలకు సారె పెడతారు.



ఉగాది పచ్చడి తింటున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



పంచాంగ శ్రవణంలో పండితుడు


## అభివృద్ధిలో భాగస్వాములవ్వండి..

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధిలో అందరూ భాగస్వాములవ్వాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన ఉగాది వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అందరం కలిసికట్టుగా జిల్లాను, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆకాక్షించారు. వేడుకల్లో వారణాసి వెంకట నారాయణ ధర్మారావు శర్మ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం వేద పండితులను మంత్రి సత్కరించారు. సంగీత నృత్య కళాశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన అలరించింది. ఎమ్మెల్యే అతిథి గజపతి రాజు, ఎమ్మెల్సీలు సురేష్‌బాబు, రఘురాజు, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, జేసీ సేతుమాధవన్, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, ఆర్డీవో డి.కీర్తి, దేవదాయ శాఖ ఏసీ శిరీషా, పర్యాటక శాఖాధికారి కుమారస్వామి పాల్గొన్నారు.



# మెరుగ్గా ఉపాధి



- వేసవి ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అధికారులు
- ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పనులు
- ఐదు అంశాలకు ప్రాధాన్యం

రాజాం రూరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు మెరుగైన ఉపాధి కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కూలీలకు ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పని కల్పించాలని భావిస్తోంది. వేసవి ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ఇందులో ఐదు అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనుంది. చెరువుల పునరుద్ధరణ, వేతనం పెంపు, పశువులకు నీటితొట్టెల నిర్మాణం, ఫీడర్ చానళ్లకు మరమ్మతులు, ఫాంపాండ్ల నిర్మాణం పనులు చేపడ్తారు. దీనిపై ఇటీవల అమరావతిలో రెండ్రోజుల పాటు కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి దిశానిర్దేశం చేశారు. ఆ మేరకు జిల్లా యంత్రాంగం గ్రామాల్లో ఏయే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి, ఏమేర నిధులు అవసరమో ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది.

### చెరువుల పునరుద్ధరణ

గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చెరువుల్ని నీరు కార్చేసింది. జిల్లావ్యాప్తంగా చెరువుల్లో తట్టెడు మట్టి తీయించలేదు. దీంతో చెరువుల్లో పూడికలు పేరుకుపోయాయి. కట్టలు శిథిలావస్థకు చేరాయి. నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయి ఎండిపోతున్నాయి. దీంతో చెరువుల పునరుద్ధరణ, జల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. తొలిదశలో గ్రామానికో చెరువును ఎంపికచేసి పూడిక తీయించి చెరువుకట్టను బలోపేతం చేయనుంది.

### సగటు వేతనానికి భరోసా

చాలామంది ఉపాధి కూలీలకు కూలి గిట్టుబాటు కావడం లేదు. దీంతో నిరాశతో ఉన్న కొంతమంది కూలీలు పనులకు దూరంగా ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో వేసవిలో రోజూ కనీస సగటు వేతనం రూ.300 దక్కేలా అధికారులు పనులు చూపించాల్సి ఉంటుంది. ఇందుకోసం నాలుగు గంటలు పని చేస్తే కూలి గిట్టుబాటయ్యేలా బృందానికి కొలతలతో మార్కింగ్ ఇస్తారు. ప్రతి శుక్రవారం రోజ్‌గార్ దివస్ సందర్భంగా పనుల మార్కింగ్, వేతనాలపై కూలీలకు అవగాహన కల్పిస్తారు.

### పశువులకు నీటి తొట్టెలు

ప్రతి గ్రామంలో పశువులకు నీటితొట్టెలను పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు. ఎక్కడెక్కడ నీటితొట్టెలు నిర్మించాలో అధికారులు నిర్ణయించాక పనులు ప్రారంభిస్తారు. పశువులు, మేకలు, గొర్రెలు తిరిగే మార్గంలో బోరు, పంచాయతీ కుళాయిలు (మిగతా 8వ పేజీలో..)

# ఒక్కరోజే చాన్స్



- పన్ను చెల్లింపుదారులకు 50 శాతం వడ్డీ రాయితీ!
- పట్టణ ప్రజలకు మంచి అవకాశం

రాజాం. మార్చి 30(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లోని పన్ను బకాయిదారులకు ఇదో మంచి అవకాశం. ఏకకాలంలో ఆస్తి పన్నులు, బకాయిలు చెల్లించిన వారికి 50 శాతం వడ్డీ రాయితీని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు ఒక్కరోజే చాన్స్ ఉంది. సోమవారం రంజాన్ సెలవు అయినప్పటికీ ప్రత్యేక కౌంటర్లు పనిచేస్తాయి. ఆస్తి పన్ను వసూలు చేస్తాయి. ఈ మేరకు పరుపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు.

ఉమ్మడి జిల్లాలో విజయనగరం నగరపాలక సంస్థ, బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు, రాజాం మునిసిపాల్టీలు ఉన్నాయి. పాలకొండ, నెల్లిమర్ల నగర పంచాయతీలుగా కొనసాగుతున్నాయి. వీటిలో భారీగా ఆస్తి పన్ను బకాయిలు పేరుకుపోయాయి. గత కొన్నేళ్లుగా ఆస్తి పన్ను పెండింగ్‌లో ఉంది. దీనికి తోడు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నులు చెల్లించాల్సిన వారు చాలామంది ఉన్నారు. గతంలో బకాయిలతో పాటు ఈ ఆర్థిక సంవత్సరంలో ఏకమొత్తంలో కట్టిన వారికి ప్రభుత్వం ఈ రాయితీని అందించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలో పట్టణ పన్నుదారులకు దాదాపు రూ.7 కోట్ల వరకూ ఉపశమనం కలగనుందని అధికార వర్గాలు లెక్కలు కడుతున్నాయి.

- ఉమ్మడి జిల్లాలో ఆస్తి పన్ను వసూలు అంతంతమాత్రంగా ఉంది. విజయనగరం నగరపాలక సంస్థలో 50 శాతం మాత్రమే వసూలైనట్టు తెలుస్తోంది. రూ.33 కోట్లు వసూలు అయ్యింది. బొబ్బిలిలో 60 శాతంతో రూ.4.41 కోట్లు, రాజాంలో 72 శాతంతో రూ.2.46 కోట్లు, నెల్లిమర్లలో 27 శాతంతో రూ.1.40 కోట్లు, పార్వతీపురంలో 46 శాతంతో రూ.4.55 కోట్లు, పాలకొండలో 68 శాతంతో రూ.1.70 కోట్లు, సాలూరులో 47 శాతంతో రూ.2.14 కోట్లు వసూలు అయింది.

### మంచి అవకాశం

పట్టణాల్లో పన్నులు చెల్లించేవారికి ఇది శుభవార్త. రాష్ట్ర ప్రభుత్వం పన్నుదారులకు 50 శాతం వడ్డీ రాయితీ కల్పించింది. గత బకాయిలను ఏకకాలంలో కట్టిన వారికి సైతం రాయితీ వర్తిస్తుంది. **- జె.రామప్పలనాయుడు, కమిషనర్, రాజాం మునిసిపాల్టీ**

# సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్లు

- ఆదివారం పనిచేసిన కార్యాలయాలు
- నేడు కూడా విధుల్లోనే..




రాజాం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆదివారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు తెరుచుకున్నాయి. ఎప్పటిలా పనిచేశాయి. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ముందే ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు సంబంధించి చివరి రెండు రోజులూ కీలకమని, ప్రభుత్వ సెలవు ఉన్నప్పటికీ పనిచేయాలని పేర్కొన్నారు. దీంతో జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలూ ఆదివారం పనిచేశాయి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ మాత్రమే తెరుచుకున్నాయి. సోమవారం కూడా రంజాన్ అయినప్పటికీ పనిచేస్తాయి. సహజంగా ఆర్థిక సంవత్సరం చివరి రెండు రోజులూ అత్యధికంగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఈసారి వారి అంచనాలు తారుమారు అయ్యాయి. క్రయ విక్రయదారులకు ముందుగా ఎటువంటి సమాచారం లేకపోవడంతో పెద్దగా రిజిస్ట్రేషన్లకు రాలేదని తెలిసింది. సోమవారం కూడా ఉదయం 11 గంటల నుంచి కార్యాలయ సేవలు అందుబాటులో ఉంటాయని రాజాం సబ్ రిజిస్ట్రార్ కావలి వేణు తెలిపారు.

# నేడు రంజాన్

- ప్రార్థనలకు సిద్ధమైన మసీదులు

విజయనగరం రూరల్, మార్చి30(ఆంధ్రజ్యోతి): నెలరోజుల రంజాన్ ఉపవాస దీక్షలు సోమవారంతో ముగియనున్నాయి. రంజాన్ కోసం జిల్లాలోని అన్ని మసీదులు సిద్ధమయ్యాయి. ఈ నెల 28 నుంచే రంజాన్ పర్వదినం కోసం మసీదుల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. విజయనగరం, బొబ్బిలి, రాజాం, ఎస్.కోట, గజపతినగరం, నెల్లిమర్ల తదితర ప్రాంతాల్లో అత్యధికంగా ప్రార్థనలు చేయనున్నారు. నెలరోజులుగా ముస్లింలు సహర్, ఇఫ్తార్ పాటిస్తూ వచ్చారు. ఇఫ్తార్ విందుకు నాయకులు, అధికారులు, స్నేహితులను ఆహ్వానించారు. ప్రభుత్వం తరుపున జిల్లా కేంద్రంలో శనివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. విజయనగరంలోని జామియా మసీదు, అబాద్‌వీధిలోని మసీదు, కంటోన్మెంట్, మూడులాంతర్లు, బాబామెట్ట ప్రాంతాల్లో ఉన్న మసీదులన్నీ రంజాన్ పండుగకు సిద్ధమయ్యాయి. వాటికి రంగు, రంగుల విద్యుత్ దీపాలను అలంకరించారు. ఆయా మసీదుల్లో సోమవారం ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక నమాజ్‌లు జరగనున్నాయి. ఇమామ్‌లు రంజాన్ విశిష్టతను వివరించనున్నారు.





విజయనగరంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు

# ప్రమాదంలో బొడ్డవలస వంతెన

● బీటలు వారిన గోడలు ● తుప్పుపట్టిపోయిన ఇనుప ఊచలు
●వెంగళరాయసాగర్ కాలువపై ఉన్న వంతెన దుస్థితి



దెబ్బతిన్న వంతెన రెయిలింగ్



వంతెన కింద భాగంలో ఇనుప ఊచలు కనిపిస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలంలోని గోపాలరాయుడిపేట దాటిన తర్వాత బొడ్డవలస వద్ద వెంగళరాయసాగర్ కాలువపై దశాబ్దాల కిందట నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. ప్రధానంగా ప్రభుత్వాలు మారుతున్నా నిర్వహణ, మరమ్మతులకు నోచుకోవడంతో వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఇరువైపులా ఉన్న గోడలు బీటలు వారడంతోపాటు రెయిలింగ్ పూర్తిగా దెబ్బతింది. గోడలు పటుత్వం లేకపోవడంతో పెచ్చులు రాలిపోతున్నాయని పలువురు వాపోతున్నారు. అలాగే వంతెన కింది భాగంలో శ్లాబు ఊడిపడిపోతోంది. గజాలు తుప్పుపట్టడంతోపాటు బయటకు కనిపిస్తున్నాయి. దీంతో వంతెన మీదుగా భారీ వాహనాలు వెళ్లే సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరుగుతాయోనన్న భయాందోళన స్థానికుల్లో నెలకొంది. బొబ్బిలి, మక్కువ మండలాల్లోని బొడ్డవలస, వెలగవలస తదితర సుమారు 20 గ్రామాల ప్రజల ఈ వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాకుండా పంట పొలాల నుంచి తమ ఉత్పత్తులను ఇళ్లకు ఇక్కడి నుంచే చేరుస్తుంటారు. ఈ మార్గంలో రోజుకు 500 వరకు వాహనాలు వచ్చిపోతున్నాయి. వెంగళరాయసాగర్ జలాశయం నుంచి బొబ్బిలి, మక్కువ మండలాల్లోని వేలాది ఎకరాలకు ఈ మార్గం గుండానే సాగునీరందుతోంది. దీంతో ఖరీఫ్, రబీ సీజన్లలో ఏటా జలవనరులశాఖ అధికారులు కాలువల పరిశీలనకు ఈ వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. తొలి రోజుల్లో వెంగళరాయసాగర్ ఆయకట్టుకు సక్రమంగా నీరందించేందుకు వీలుగా కాలువను పరిశీలించేందుకు అప్పట్లో నీటిపారుదల శాఖ అధికారులు ఇక్కడ వంతెన నిర్మించారు.తర్వాత కాలంలో పలు గ్రామాల ప్రజలకు వారధిగా మారింది. అయితే దశాబ్దాలు గడుస్తున్నా కనీస మరమ్మతులకు అధికారులు దృష్టి సారించడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.కాగా వంతెనకు సంబంధించి ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరు కాగానే పనులు చేస్తామని నీటిపారుదలశాఖ బొబ్బిలి సర్కిల్ ఏఈ సుధీర్ తెలిపారు.

# విజయనగరంలో గోశాల దగ్ధం

విజయనగరం క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని సిటీ బస్టాండ్‌లో గల కనకమహాలక్ష్మి, అభయాంజనేయ స్వామి దేవాలయాలకు సంబంధించిన గోశాల ఆదివారం దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా, లేకుంటే మరే ఇతర కారణంతో జరిగిందా అన్న విషయం తెలియరాలేదు. అగ్నిమాపకశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చిన వెంటనే చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

# వావిలపాడులో ఎడ్ల బండ్ల పరుగు పోటీలు



దౌడు తీస్తున్న ఎడ్లు

వేపాడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వావిలపాడు, బొద్దాం, సోంపురం, వేపాడ గ్రామాలో నూకాలమ్మ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. వావిలపాడులో నూకాలమ్మ అనుపోత్సవం పురస్కరించుకొని సాయంత్రం ఏర్పాటు చేసిన ఎడ్లబండ్ల పరుగు పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వావిలపాడులోని గండి వెంకటరావుకు చెందిన మరిడిమాంబ బండి, నెక్కలవానిపాలెంలోని పైడి తల్లమ్మ, దేవరాపల్లిలోని వీరాంజనేయ బండికి బహుమతులు లభించాయి. అనంతరం విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు.

# ఆక్రమణల అడ్డా.. సారథి గెడ్డ

● ఆక్రమణలతో కుచించుకుపోయిన వైనం ●చోద్యంచూస్తున్న అధికారులు



అంతకాపల్లి సమీపంలో సారథిగెడ్డలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

రాజాం రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సారథిగెడ్డపై అధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఆక్రమణలు పుణ్యమాని కుదించుకుపోతోంది. దీంతో వర్షాకాలంలో వరదల సమయంలో పంటపొలాలు నీటముంపునకు గురవుతున్నాయి. దీనికితోడు ఈ గెడ్డ పరిధిలో కాలువల్లో ఏళ్ల తరబడి పనులు చేపట్టకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో నీటిప్రవాహంసజావుగా జరగకపోవడంతో ఆయకట్టుకు నీరందడం లేదు.

### ఇదీ పరిస్థితి

నాలుగుమండలాల పరిధిలో సుమారు 30 వేల ఎకరాల ఆయకట్టుకు సారథిగెడ్డ ద్వారా సాగునీరందించాల్సిఉంది. గత పాలకుల నిర్లక్ష్యం, రైతుల స్వార్థం పుణ్యమాని అడుగడుగునా రైతులు ఆక్రమించడంతో గెడ్డ కుదించుకుపోతోంది. దీంతో ఏయేటికాయేడు గెడ్డ పరిధిలో సాగువిస్తీర్ణం తగ్గిపోతోంది. అన్నదాతను ఆదుకునే గెడ్డవైపు గత పాలకులు కన్నెత్తి చూడలేదు. దీంతో సుమారు 30 కిలోమీటర్ల మేర రెల్లిగెడ్డతోపాటు పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. వర్షాకాలంలో సైతం గెడ్డపొంగినా జలాలు ముందుకు సాగేందుకు వీల్లేని పరిస్థితులు నెలకొన్నాయి.

### రెల్లిగెడ్డలో మిగులు జలాలు

తెర్లాం మండలంలోని మిగులు జలాలు రాజాం మండలంలోని పలు గ్రామాల చెరువులను గొలుసుకట్టు విధానం ద్వారా నింపుతూ సారధి గెడ్డలో చేరేలా బొబ్బిలిరాజుల హయాంలో రూపకల్పన చేశారు. దశాబ్దాలుగా సారధిగెడ్డకు ఆనుకునిఉన్న భూములను సస్యశ్యామలం చేస్తోంది. శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం మండలంలో ప్రవహిస్తూ పొందూరు మండలంలోని రెల్లిగెడ్డలో మిగులునీరు చేరుతోంది. సుమారు 30 కిలో మీటర్ల మేర ప్రవహిస్తూ పంటపొలాలకు సాగునీరందించే సారధిగెడ్డ ప్రస్తుతం అధ్వానంగా మారింది.తెర్లాం మండలంలోని మొదలుకుని రాజాం, జి.సిగడాం, పొందూరు మండలాల పరిధిలో అవకాశమున్న చోటల్లా చిన్న, సన్నకారు రైతులు గెడ్డలో ఆక్రమించి పొలాలుగా మార్చుకున్నారు. దీంతో మిగులు జలాలు గెడ్డలోకి చేరే అవకాశం లేకుండాపోయింది. ఈనేపథ్యంలో శివారు ఆయకట్టుకు నీరు చేరే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఫలితంగా అన్నదాత ఆకాశం వైపు ఖరీఫ్‌లో సైతం ఏటా ఎదురుచూడాల్సి వస్తోంది.తక్షణమే సారధిగెడ్డలోని ఆక్రమణలు తొలగించి సాగునీరు నాలుగు మండలాల ఆయకట్టుకు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# పాస్టర్ మృతిపై విచారణ నిర్వహించాలి

●నిందితులను శిక్షించాలి ● బొబ్బిలి, ఆరికతోటలో ర్యాలీ




రామభద్రపురం: ర్యాలీ చేస్తున్న ఆరికతోట ఏడీఎం బాప్టిస్ట్‌చర్చి కాపరులు

పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై తక్షణమే విచారణ నిర్వహించాలని చర్చిల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఆదివారం బొబ్బిలి, ఆరికతోటలో ర్యాలీలు నిర్వహించారు.

బొబ్బిలి,మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతి నేపథ్యంలో ఆదివారం బొబ్బిలిలో సెంటినరీ బాప్టిస్టు చర్చి ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ప్రవీణ్ మృతి వెనుక ఉన్న మిస్టరీని వెలికితీసి హత్య అని తేలితే నిందితులను శిక్షించాలని డిమాండ్‌చేశారు.

● రామభద్రపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం చిత్తశుద్ధితో విచారణ జరిపించాలని ఆరికతోట ఏడీఎం బాప్టిస్ట్‌చర్చి కాపరుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ప్రెసిడెంట్ చంద్రశేఖర్, కార్యదర్శి జార్జి ఎబినేజర్‌లు మాట్లాడుతూ దైవ సేవకులపైన దాడులకుపాల్పడడం హేయమైన చర్యఅని,దేశంలో అందరూ సోదర సమానత్వంతో కలిసిమెలిసి ఉంటున్న తరుణంలో మైనారిటీలపై హత్యలకు పాల్పడడం ప్రజాస్వామ్యవ్యవస్థను విచ్ఛినంచేయడమేనన్నారు.ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం విచారణ వేగవంతం చేసి పోస్టుమార్టం రిపోర్టు వెల్లడించాలని సీబీఐ విచారణకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సంఘ పెద్దలు, మాజీ సర్పంచ్ పెంకి భీమయ్య, సున్నపు ఆదయ్య, చర్చి పాస్టర్ సురేష్‌కుమార్, రవికుమార్, బాబ్జీ, పెంకి శేఖర్‌బాబు, రేజేటి అప్పారావు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాభివృద్ధే లక్ష్యం

●నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పీ-4 మోడల్ ద్వారా ప్రభుత్వ విధానాలు, ప్రైవేటు రంగం, ప్రజల భాగస్వామ్యం, పారిశ్రామికవేత్తల మద్దతుతో రాష్ట్రాన్ని వేగంగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన జారీచేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్లే క్రమంలో భాగంగా అమెరికాలోని మిషిగాన్‌లో పెట్టుబడిదారులతో నాగమాధవి సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర-2047 కింద రాష్ట్రాభివృద్ధికి అవకాశాలను వివరిస్తూ పీ-4 మోడల్ ద్వారా పెట్టుబడిదారులకు రాష్ట్రంలో అవకాశాలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో ఆర్థిక వ్యవస్థ, మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ కల్పన వంటి కీలక రంగాల్లో ప్రగతిని వివరించేందుకు పీ-4 మోడల్‌ను వినియోగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లోకం ప్రసాద్, వివిధ రంగాలకు చెందిన ప్రవాస భారతీయులు, పారిశ్రామిక వేత్తలు, నిపుణులు పాల్గొన్నారు.

## పైడిమాంబ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

విజయనగరం రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని పైడిమాంబ ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన పైడిమాంబ భక్తుడు మాగంటి బాబు, జ్యోతి దంపతులు ఉగాది పురస్కరించుకుని ఆదివారం రూ. 1,11,111 విరాళం ఇచ్చారు. ఈ మేరకు చెక్కును ఆలయ సూపరిండెంటెంట్ ఏడు కొండలకు అందజేశారు. పైడిమాంబ నిత్యాన్న పథకానికి ఈ మొత్తాన్ని వినియోగించాలని బాబు, జ్యోతిలు కోరారు.

## ఆలయాలకు ఎల్‌ఈడీ బల్బులు

చీపురుపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కిల్లంశెట్టి సన్యాసిరావు 20 ఆలయాలకు ఎల్‌ఈడీ బల్బులు అందజేశారు. తమ తలిదండ్రులు కిల్లంశెట్టి వెంకటరామాంజనేయులు, లక్ష్మీకుమారి జ్ఞాపకార్థం వీటిని అందజేసినట్టు తెలిపారు. ఈ మేరకు ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్ సెట్లను కనకమహాలక్ష్మి అమ్మవారి ఈవో బండ్లమూడి శ్రీనివాస్, ఆలయ కమిటీ ఛైర్మన్ గవిడి నాగరాజులకు అందజేశారు.

## ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు

రాజాం మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో ఎవరైనా ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తప్పవని మునిసిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు ఒక ప్రకటనలో ఆదివారం హెచ్చరించారు. నిషేధాజ్ఞలు ఉల్లఘించిన వారిపై మొదటిసారిగా పట్టుబడితే రూ.500 నుంచి ఐదు వేలు వరకు అపరాదరుసుం విధించనున్నట్లు తెలిపారు.రెండోసారి పట్టుబడితే ట్రేడ్ లైసెన్స్‌లు రద్దుచేసి షాపులు వ్యాపార సంసలను జప్తు చేసి భారీ జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. ప్రధానంగా వీధి వ్యాపారులు. దుకాణ యజమానులు ఈ విషయంలో నిక్కచ్చిగా వ్యవమారించాలనికోరారు.ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

# 'పీఎంఈజీపీ'ని వినియోగించుకోండి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



లబ్ధిదారుడికి ఆటో తాళం అందజేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం/కలెక్టరేట్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పీఎంఈజీపీ యూనిట్లను వినియోగించుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. ఆదివారం విజయనగరంలోని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో గంట్యాడ మండలానికి చెందిన నాలుగు పీఎంఈజీపీ యూనిట్లను ప్రారంభించారు.లబ్ధిదారులకు ఆటోయూనిట్ తాళాలు అందజేశారు. ఈసందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, పొందిన యూనిట్లను లాభదాయకంగా నిర్వహించి కుటుంబ ఆర్థికస్థితిని మెరుగుపరుచుకోవాలని కోరారు.ఈపథకం కింద 35 శాతం మార్జిన్ మనీ మంజూరు చేయనున్నట్లు తెలిపారు. బ్యాంకు రుణాల రీపేమెంట్‌ను నిబంధనల ప్రకారం నిర్వహించాలని లబ్ధిదారులను కోరారు.కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, సెర్ప్‌డీపీఎం హరేరామ్, ఏపీఎం సులోచనాదేవి, టీడీపీనాయకులు కొండపల్లి కొండబాబు,కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఛైర్మన్ అర్జున్, గంట్యాడ టీడీపీ మండలాధ్యక్షుడు కొండపల్లి భాస్కరనాయుడు, విజయ్‌కుమార్, శాస్త్రి, రమేష్ పాల్గొన్నారు.

## సేవాభావాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

శృంగవరపుకోట రూరల్ మార్చి 30: మండలంలోని ముషిడిపల్లి గ్రామ సచివాలయ సిబ్బంది సేవాభావాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కోరారు. ఆదివారం తాటిపూడి-ముషిడిపల్లి జంక్షన్‌లో మజ్జిగ చలివేంద్రం వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు ఆధ్వర్యంలో ప్రారంభించారు.

### చల్లటి నీరు ప్రాజెక్టు ప్రారంభం

విజయనగరం రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ ఆలయంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చల్లటి నీరుప్రాజెక్టును విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆదివారం ప్రారంభించారు. అనంతరం పైడిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులను అదితి గజపతిరాజు సన్మానించారు.

## మేలో సీతంపేట బండమ్మతల్లి పండగ

శృంగవరపుకోట మార్చి 30 (ఆంధ్రజ్యోతి):ఎస్.కోట పంచాయతీ పరిధిలో గల సీతంపేట గ్రామంలోని బండమ్మతల్లి పండగ మే నెలలో నిర్వహించాలని పెద్దలు నిర్ణయించారు. ఆదివారం ఎస్.కోటలో పండితుడు భాస్కర శర్మ పంచాంగ శ్రావణం నిర్వహించారు. ఈ ఏడాది దారగంగమ్మ తల్లి పెద్ద పండగ లేకపోవడంతో చిన్న పండగ కోసం మే 13న పసుపు, కుంకాలు ఇచ్చుకోవాలని నిర్ణయించారు. దారగంగమ్మ పండగకు సంబంధించిన మూహూర్తంపై ప్రతి ఏటా పంచాంగం శ్రావణ నిర్వహించే సమయంలో నిర్ణయం తీసుకుంటారు. ఈ మేరకు 17 సంవత్సరాల తర్వాత ఈ పండగ చేయాలని నిర్ణయించారు.మే 14న చాటింపు, మే 31న తోలేళ్లు, జూన్1న అనుపు కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో దారగంగమ్మ తల్లి అనువంశిక పూజారి మోపాడ గౌరినాయుడు, గ్రామపెద్దలు వేమలి పెద్ద నారాయణరావు, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, ఆర్యవేశ్యప్రముఖులు బొండా వెంకటరావు, బొండారామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.కోటలో బ్యాడ్మింటన్ టోర్నీ

శృంగవరపుకోట మార్చి 30 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులకు ఉగాది పురస్కరించుకుని టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలుగా విభజించి పోటీలను ఏర్పాటుచేశారు.చీఫ్ కోచ్ పోట్నూరు శ్రీరాములు ఈ క్రీడలను పర్యవేక్షించారు.

# ప్రజల చైతన్యకోసం పతంజలి రచనలు

విజయనగరం దాసన్నపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్య చరిత్రలో సమాజంలోని లోపాలను వ్యంగ్యరచనల ద్వారా కడిగిపారేసిన గొప్ప రచయిత కేఎన్‌వై పతంజలి అని రచయిత తాడిప్రకాష్ తెలిపారు.శనివారంరాత్రి విజయనగరంలోని గురజాడ గ్రంథాలయంలో పతంజలి సాహిత్యపురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న దుష్ట పరిణామాలపై తన రచనలు ద్వారా ప్రజా చైతన్యం కోసం తన సొంతబాణీతో సరికొత్త రచనలు చేశారన్నారు. కార్యక్రమంలో పతంజలి సాంస్కృతిక వేదిక ప్రతినిధులు భీశెట్టి బాబ్జీ, ఎంకే బాబు, ప్రతాప్‌వర్మ, లక్ష్మణరావు, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## ఆలయాలకు పోటెత్తిన భక్తులు



విజయనగరం రూరల్: పైడిమాంబకు ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

జిల్లాలోని పలు ఆలయాలకు ఉగాది పురస్కరించుకుని ఆదివారం తెల్లవారు జాము నుంచే పోటెత్తారు. పలువురు కొత్తగాకొనుగోలు చేసిన వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు.

విజయనగరం రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని ప్రముఖ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మూడులాంతర్ల వద్ద చదురుగుడి, రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వనంగుడి వద్ద ఉదయం ఆరు గంటల నుంచే భక్తులు బారులుతీరారు. కొత్తపేటలోని సంపత్ వినాయక ఆలయంలో హోమం నిర్వహించారు. సిటీబస్టాండ్ వద్ద సిద్ధిబుద్ధి వినాయక ఆలయం, కాశీ విశ్వేశ్వరాలయం, దాసన్నపేటలోని పెద్ద ఆంజనేయస్వామి, శివాలయం వీధిలోని వేంకటేశ్వర, ఉమారామలింగేశ్వర, బాబామెట్టలోని సూర్యనారాయణ స్వామి ఆలయంతోపాటు నగరంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

●నెల్లిమర్ల,మార్చి 30(ఆంధ్రజ్యోతి): రామతీర్థంలోని రామస్వామివారి దేవస్థానంలో ఉగాది పురస్కరించుకొని ప్రధాన అర్చకులు ఖండవిల్లి సాయిరామ చార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

●చీపురుపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం ఈపీడీసీఎల్‌లో జేఏఓ అద్దూరి సీతబాబు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరింతగా దాతలు ముందుకొచ్చి ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు.

## కంటోన్మెంట్‌లో దేవీ దండుమారమ్మ ఉత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్ దంపతులు

విజయనగరం క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని దేవీ దండుమారమ్మ కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఆదివారం విజయనగరంలోని కంటోన్మెంట్‌లోని దేవి దండుమారమ్మ ఉత్సవాలను ఎస్పీ వకుల్ జిందాల్, ఏపీఎస్‌పీ బెటాలియన్ కమాండెంట్‌ంట్ మలికా గార్గ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. తొలిరోజు ఆలయ ప్రాంగణంలో ఎస్పీ వకుల్ జిందాల్ దంపతులతో వినాయక పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, కుంకుమార్చన, చండీపారాయణ, విశేషహోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీలుశ్రీనివాసరావు, ఆర్ఐలు గోపాలనాయుడు, రమేష్,టి.శ్రీని వాసరా వు,ఎస్.శ్రీనివాస్, నర్సింహమూర్తి, ఆలయకమిటీ సభ్యులు తాతరాజు,రవిశ్వేరుడు వాసు, శివ, లక్ష్మణ్‌శ్రీనివాసరావు, అప్పన్ననాయుడు, బంగారునాయుడు పాల్గొన్నారు.



సంకిలి వద్ద సాయన్నచానల్‌లో రంగుమారిన నీరు

# కలుషితమై.. రంగుమారి

●చేపల వ్యర్థాలు, శుద్ధిచేయని జలాలు విడిచిపెడుతున్నవైనం
●ఆందోళన చెందుతున్న సాయన్నచానల్ ఆయకట్టు రైతులు

రేగిడి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సాయన్నచానల్‌లోకి కొద్దిరోజులుగా రంగుమారిన, కలుషితమైన నీరు చేరుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.చేపల వ్యర్థాలు, శుద్ధిచేయని జలాలు చానల్‌లోకి ప్రైవేటు పరిశ్రమ నిర్వాహకులు, చేపల పంపకందారులు విడిచిపెడుతున్నారని రైతులు వాపోతున్నారు.

### పశువులు తాగితే..

పాతచెలిగానవలసహెడ్‌గాఉన్న సాయన్నచానల్ మండలంలో దాదాపు పది గ్రామాల మీదుగా తొమ్మిది కిలోమీటర్లు పొడువన ప్రవహిస్తోంది. ఆయా గ్రామాల్లో వందలాది ఎకరాలకు చానల్ ద్వారా నీరందుతోంది. ఒక పక్క రెగ్యులేటర్లు, షట్టర్లు పాడై ఈ చానల్ నిర్వహణ నీరుగారుతున్న తరుణంలో ఈ ప్రాంతంలో ఉన్న చేపల చెరువులు, ఓ ప్రైవేటు పరిశ్రమ నుంచి వ్యర్థ జలాలు శుద్ధిచేయకుండా సాయన్నచానల్‌లోకి విడిచిపెడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సంకిలి, వెంకమ్మపేట వద్ద గల చేపలచెరువుల నిర్వాహకులు ఏకంగా సాగునీటిచానల్‌లోకి వ్యర్థ జలాలు పైపులతో విడిచిపెడుతున్నారని స్థానిక రైతులు ఆరోపిసున్నారు. ఈ విషయాన్ని అధికారులకు తెలియజేసినా ఫలితం లేకుండాపోయిందని సంకిలి, పుర్లి, బొడ్డవలస, కొమిర, ఆడవరం తదితర గ్రామాల రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం అక్కడక్కడ రబీలో ఆరుతడి పంటలు సాగులో ఉన్నాయి.ఈ నేపథ్యంలో అరకొరగా అందుబాటులో ఉన్న నీరు రంగుమారి, కలుషితం కావడంతో పంటలపై ప్రభావం పడే అవకాశముందని రైతులు వాపోతున్నారు.ఈరంగుమారిన నీటిని మనుషులు, పశువులు తాగితే వ్యాధులు ప్రబలే అవకాశముందని ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా కాలుష్య నియంత్రణ, ఇరిగేషన్, మత్స్యశాఖకు చెందిన ఉన్నతాధికారులు చానల్ పరిశుభ్రతపై దృష్టిపెట్టాలని రైతులు కోరుతున్నారు.

# ఖాళీ చేయించారు.. కూల్చకుండా వదిలేశారు



శిథిలావస్థలో ఉన్న జగన్నాథపురం ప్రాథమిక పాఠశాల భవనం

●శిథిలావస్థకు చేరడంతో భయాందోళన చెందుతున్న తల్లిదండ్రులు ●ఇదీ జగన్నాథపురం ప్రాథమిక పాఠశాల పరిస్థితి

బొబ్బిలి రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురం పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో ఏ క్షణంలోనైనా కూలిపోయే అవకాశం ఉండడంతో ఖాళీచేయించారు. అయితే కూల్చకపోవడంతో విద్యార్థులు తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. జగన్నాథపురంలో నూతన ప్రాథమిక పాఠశాల భవనానికి ఎదురుగా దశాబ్దాల కిందట నిర్మించిన పురాతన భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో మండల ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి ఆ భవనంలో తరగతులు నిర్వహించొద్దని ఐదేళ్ల కిందట ఖాళీ చేయించారు. పాఠశాల నిర్వహించే, ఖాళీ సమయంలో విద్యార్థులు ఈ భవనంలోకి ఆడుకుంటున్నారు.ఆ సమయంలో కూలిపోతే ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే భవనాన్ని కూల్చేయాలని పలువురు కోరుతున్నారు. కాగా భవనం దుస్థితిని ఇప్పటికే మండల విద్యాశాఖ అధికారులకు తెలియజేశామని హెచ్ఎం సూర్యనారాయణ తెలిపారు.


గరుగుబిల్లి: తోటపల్లిలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న దృశ్యం


మక్కువ: శంబర పోలమాంబ ఆలయంలో..


నెల్లిమర్ల: రామతీర్థం రామస్వామి దేవాలయంలో..


సీతంపేట రూరల్: టీటీడీ దేవాలయంలో పూజా కార్యక్రమాలు

# వైభవంగా ఉగాది వేడుకలు

- వాడవాడలా పంచాంగ శ్రవణాలు ● ఏరువాక చేపట్టిన రైతులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు ● ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తెలుగు నూతన సంవత్సరాది.. విశ్వావసు నామ ఉగాది వేడుకలను ఆదివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. రైతులు వేకువజామున పొలాలకు వెళ్లి ఏరువాక చేపట్టారు. గ్రామాల్లో వేద పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఉగాది పండగ విశిష్టతను వివరించారు. పలు గ్రామాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పలుచోట్ల భజన కార్యక్రమాలు నిర్వహించారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


బొబ్బిలి: ఉగాది వేడుకల్లో భాగంగా కళాభారతి ఆడిటోరియంలో పౌరాణిక నాటక ప్రదర్శన


పార్వతీపురం రూరల్: ఎమ్మెల్యే విజయచంద్రకు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న కూటమి నాయకులు


ఎస్.కోటలో పంచాంగ శ్రావణం


గరివిడి: కోనూరులో పంచాంగ శ్రవణం


రాజాం: కొండంపేటలో ఉగాది సంబరాలు


ఎస్.కోట రూరల్: ధర్మవరంలో పంచాగ శ్రవణం


పాలకొండ: లుంబూరులో భజన పోటీలు


బొబ్బిలి రూరల్: రాజచ్చెరువలసలో ఉగాది సంబరాలు

## పార్వతీపురం కలెక్టరేట్‌లో..

పార్వతీపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాలో విశ్వావసు నామ ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్వతీపురంలోని లయన్స్ కల్యాణ మండపంలో నిర్వహించిన వేడుకలను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ప్రారంభించారు.

### 29మందికి పురస్కారాలు

పార్వతీపురం మన్యం జిల్లాలో వివిధ రంగాల్లో రాణిస్తున్న 29 మందికి ఈ వేడుకల్లో ఉగాది పురస్కారాలను అందించారు. పురస్కారాలు అందుకున్న వారిలో నారంశెట్టి ఉమామహేశ్వరరావు, గంటేడ గౌరునాయుడు, తాడ్డి సతీష్‌కుమార్, గడగమ్మ రామకృష్ణ, శీర జయరాం, బెహరా ఉమామహేశ్వరావు, బుడితి బలరాం నాయుడు, డా.వైవీ పద్మజ, పెంటపాటి సూరాయరావు, బొండపల్లి వెంకటరమణ, నంకా గౌరీశంకరరావు, మాదా కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

### వేద పండితులకు సత్కారం

దేవదాయశాఖకు చెందిన త్సదువుల వీరభ ద్రాస్వామి, సింహదాటి శంకరరావు, ధమరసింగు కనక లింగేశ్వరరావు తదితర వేద పండితులను సత్క రించారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న చావలి శేషాద్రి సోమయాజులు, చింతా అప్పలనాయుడు, మీసాల వెంకటగౌరీశంకరరావు, ఇల్లా ప్రసన్నలక్ష్మి, మల్లిపూడి జగదీష్, గొట్టాపు శ్రీనివాసరావు, బౌరోతు శంకరరావు, కిపల్లి దాలినాయుడు, గుడ్ల అమ్మాజీ, జమ్మ బాబూరావు, పళ్ల రోహిణీకుమార్, పొందూరు సుధాకుమార్ తదితరులను సత్కరించారు.


పార్వతీపురం: కలెక్టర్, ఎస్పీల చేతులమీదుగా ఉగాది పురస్కారం అందుకుంటున్న సర్వమంగళదేవి పీఠం వ్యవస్థాపకుడు కాళిదాసుశర్మ

## జిల్లా వాసులకు రాష్ట్ర స్థాయి పురస్కారాలు

డెంకాడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఉత్తమ రైతుగా డెంకాడ ప్రాంతానికి చెందిన కలిదిండి వెంకటసూర్యనారాయణ రాజు(పాణి) ఉగాది రోజున అమరావతిలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈయన పాటిస్తున్న సమగ్ర వ్యవసాయ విధానాలు ప్రభుత్వ దృష్టికి వెళ్లా యి. వివిధ పంటల్లో నూతన రకాలు అభివృద్ధి చేస్తున్న తీరును పరిశీలించిన ఉన్నతాధికారులు ఉగాది పురస్కారానికి ప్రతిపాదించారు. ● రాజాం: రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులు మీదగా ఆదివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. సాహిత్య రంగంలో ఆయన చేసిన సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేశారు. ● బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి వీణల కేంద్రానికి చెందిన కళాకారుడు సర్వసిద్ధి సూర్యప్రకాశరావు సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఆదివారం విజయవాడలో కళారత్న (హంస) ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు.


ముఖ్యమంత్రి నుంచి ఉత్తమ రైతు అవార్డు అందుకుంటున్న పాణిరాజు


పురస్కారాన్ని అందుకుంటున్న రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు రంగనాథం


అందుకున్న పురస్కారంతో సూర్యప్రకాశరావు

## వ్యవసాయం బాగు.. బాగు

(ఐదో పేజీ తరువాయి)

వింటూ నక్షత్రం, రాశి ఆధారంగా విశ్వావసునామ సంవత్సరంలో తమ జాతకం ఏ విధంగా ఉంటుందో తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండుతాయని, ధాన్యం ధరలు పెరుగుతాయని పురోహితులు వివరించారు. రాజకీయ నాయకుల్లో ఎక్కువ మందికి పదవులు లభించనున్నాయని, రాజకీయ అస్థిరతకు అవకాశం లేదని, ఆంధ్రప్రదేశ్‌తో పాటు విజయనగరం జిల్లా కూడా అభివృద్ధి బాటలో పయనిస్తుందని పండితులు తమ, తమ పంచాంగ శ్రవణంలో పేర్కొన్నారు.

## మెరుగ్గా 'ఉపాధి'

(ఐదో పేజీ తరువాయి)

ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యత ఇచ్చి నిర్మాణ పనులు చేపడతారు. ఏప్రిల్ నెలాఖరుకు నీటితొట్టెల నిర్మాణం పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలందాయి.

### ఫీడర్ ఛానళ్ల మరమ్మతులు

ప్రతి మూడేళ్లకోసారి పూడికతీత పనులు చేపట్టాలి. అయితే ఈ నిర్ణయానికి గత ప్రభుత్వం తిలోదకాలిచ్చింది. ఫలితంగా ఫీడర్‌ఛానళ్లలో పూడికలు పేరుకుపోయి, ఆనవాళ్లు కోల్పోయాయి. కూలీలకు పనుల కల్పనలో భాగంగా వీటి రూపురేఖలు మారనున్నాయి. పనులకు సంబంధించి మూడు దశల్లో ఫొటోలు తీసి నమోదు చేయాలి. పూడిక తొలిగితే శివారు భూములకు సాగునీరందేలా చూస్తారు.

### ఫాంపాండ్ల నిర్మాణం

ఫాంపాండ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. వ్యవసాయ భూముల్లో పడిన వాననీటిని ఒడిసిపడితే నీటిఎద్దడిని కొంతమేర తగ్గించవచ్చన్న ఆలోచనతో వీటి నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఉపాధి పనులకు వచ్చే కూలీలలో 20 శాతం మందిని ఈ పనులకు మళ్లించేలా అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్దేశాల మేరకు వేసవి ప్రణాళికలను ఆయాశాఖల అధికారులు తయారు చేస్తున్నారు.

## రామకృష్ణకు 'ఆర్ట్ ఆఫ్ లెజెండ్'

బొబ్బిలి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణానికి చెంది న కాదూరి రామకృష్ణ అంతర్జాతీ య స్థాయి 'ఆర్ట్ ఆఫ్ లెజెండ్' అవార్డును గెలుచుకున్నారు. అమలాపురంలో కోనసీమ చిత్ర కళా పరిషత్ సంస్థ ఇటీవల చిత్రకళా బ్రహ్మోత్సవాన్ని నిర్వ హించింది. 35వ అంతర్జాతీయ చిత్రలేఖనా ప్రదర్శన, పోటీలలో భాగంగా రామకృష్ణ.. బొబ్బిలి యుద్ధవీరుడు-స్మారక స్తూపంపై గీసిన చిత్రానికి ఆర్ట్ ఆఫ్ లెజెండ్ అవార్డును సొంతం చేసుకున్నారు. వార్ పిల్లర్-లెగసీ ఆఫ్ విక్టరీ (యుద్ధస్తంభం-విజయ వారసత్వం) నేపథ్యంతో రామకృష్ణ గీసిన ఈ చిత్రానికి గుర్తింపు లభించింది. ఈసందర్భంగా రామకృష్ణ ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. చిత్ర కళా సంస్థ 'అవర్ ఆర్టిస్ట్ -బోర్న్ టు ఎక్సెల్' పేరుతో 300 పేజీల పుస్తకాన్ని ఆవిష్కరించిందని, అందులో తాను గీసిన శుభ గణేశ్, ముంతాజ్, వీరబొబ్బిలి అనే మూడు చిత్రాలకు స్థానం దక్కిందని తెలిపారు. రామకృష్ణకు అవార్డు రావడం పట్ల ఎమ్మెల్యే బేబీనాయన అభినందించారు.


అవార్డు, తాను గీసిన చిత్రం చూపిస్తున్న రామకృష్ణ

## సీతారాముల విగ్రహాల ఊరేగింపు

బొబ్బిలి రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకుని పిరిడి గ్రామంలో ఆదివారం ఒక రామమందిరంలోని సీతారాముల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి మరో రామమందిరంలో పెట్టారు. వచ్చే నెల 6వ తేదీ శ్రీరామనవమి వరకు ఆ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

### ముత్తావలసలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ముత్తావలస గ్రామంలో శ్రీరామనవమి నవరాత్రి ఉత్సవాలను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. సర్పంచ్ పిల్లా వసుంధర పాల్గొని, పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి అందజేత


చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పైడి అరుణ అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆమెకు సీఎం సహాయ నిధి నుంచి రూ.25,166 మంజూరయ్యింది. ఈ చెక్కును ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదివారం గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంపు కార్యాలయంలో అరుణ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మాలధారణ


శ్రీరామ మాలధారణ చేపట్టిన భక్తులు

గరుగుబిల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామ మాలధారణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కొంకడివరం, సీతారాంపురం, దళాయివలస, తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మాలధారణ చేపట్టారు. 9 రోజుల పాటు దీక్షాధారణ ఉంటుందని నిర్వాహకుడు జీసీహెచ్ తిరుపతిరావు తెలిపారు.

## ఘనంగా బాలలక్ష్మీ గోవిందమ్మ పేరంటాలు యాత్ర

వీరఘట్టం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అచ్చెపువలస గ్రామంలో ఉన్న బాలలక్ష్మీ గోవిందమ్మ పేరంటాలు యాత్ర ఆదివారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

## 'ఉపాధి' కల్పించరూ..

- గిరిజన పంచాయతీపై నిర్లక్ష్యమేల?
- రావివలస గ్రామస్థులు ఆందోళన

రామభద్రపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తమ పంచాయతీలో ఉపాధి పనులు కల్పించాలని రావివలస గ్రామస్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు. గత కొన్నేళ్లుగా ఇక్కడ ఉపాధి పనులు మంజూరు కాలేదు. దీంతో ఆ పంచాయతీ పరిధిలోని గ్రామస్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఈ పంచాయతీలో 14 మదుర గ్రామాలు ఉన్నాయి. అయితే ఒక్క ఉపాధి పని కూడా కల్పించకపోవడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఏకైక గిరిజన పంచాయతీపై ఈ విధంగా జిల్లా అధికారులు నిర్లక్ష్యం చూపడం ఎంతవరకు భావ్యమని ఆ గ్రామానికి చెందిన జీలికల బుచ్చమ్మ, సోమత పెంటయ్య, పొగారపు గౌరమ్మ తదితరులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తమ గ్రామానికి ఉపాధి పనులు కల్పించాలని వారు కోరుతున్నారు.


ఉపాధి పనులు కల్పించాలని కోరుతున్న రావివలస గ్రామస్థులు

### ఎన్నిసార్లు కోరినా ఫలితం లేదు

గత దశాబ్ద కాలం నుంచి ఇక్కడ ఫీల్డ్ అసిస్టెంట్ లేరు. దీంతో పనులు మంజూరు చేసే నాథుడే కరువయ్యాడు. ఈ సమస్యను పరిష్కరించాలని మండల స్థాయి అధికారిని ఎన్నిసార్లు కోరినా ఫలితం లేదు. కూలీల హాజరు శాతం తక్కువ కావడంతో ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించ లేకపోతున్నామని అధికారులు చెప్పకొస్తున్నారు.

- కుమారి, సర్పంచ్, రావివలస

### ప్రతిపాదనలు పంపించాం

పనుల మంజూరు, ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు భర్తీకి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. కానీ కూలీల హాజరు శాతం తక్కువగా ఉందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఆ గిరిజన గ్రామాల్లో కొన్ని పనులను మేట్లతో ద్వారా చేయడానికి చర్యలు చేపడతాం.

- గొలగాన త్రినాథ, ఏపీవో, రామభద్రపురం

## ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా


ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక కోటలో ముస్లిం కుటుంబాలకు ఎమ్మెల్యే బేబీనాయన రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 500 ముస్లిం కుటుంబాలకు ఆయన ఈ సరుకులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు ముస్లింలంతా కృతజ్ఞతలు తెలిపారు.

### బాడంగిలో..

బాడంగి: రంజాన్ సందర్భంగా బాడంగిలో ఉన్న 51 ముస్లిం కుటుంబాలకు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తన సొంత నిధులతో సర్పంచ్ కండి రమేష్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫాను పంపిణీ చేయించారు. టీడీపీ నాయకుడు గుణుపూరు స్వామినాయుడు, ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీను, రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరి, పార్టీ యూత్ లీడర్ గుణుపూరు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## 6న సీతారాముల కల్యాణం

గరుగుబిల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తోటపల్లిలోని కోదండరామస్వామి దేవస్థానం పరిధిలో వచ్చే నెల 6న శ్రీరామ నవమి సందర్భంగా సీతారామస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఈవో సూర్యనారాయణ ఆదివారం తెలిపారు. కల్యాణం అనంతరం పట్టాభిషేక మహోత్సవం ఉంటుందని చెప్పారు. స్వామివారి కల్యాణంలో పాల్గొనే భక్తులు ముందుగా కార్యాలయంలో రూ.500 చెల్లించాని ఆయన సూచించారు.

## వెంకన్నకు కాంస్య కిరీటం

బొబ్బిలి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సింగారపు వీధిలో గల వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గల స్వామివారికి ఉగాది సందర్భంగా పట్టణానికి చెందిన మల్లేడ గోపాలకృష్ణ, మంజుల దంపతులు కాంస్య కిరీటాన్ని బహూకరించారు. ఆలయ అర్చకు లు పూజలు జరిపించి స్వామి వారికి కిరీ టాన్ని అలంకరించారు. ఆలయ ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు, చెలికాని వేణుగోపాలరావు పాల్గొన్నారు.


కాంస్య కిరీటంతో వేంకటేశ్వరస్వామి

## బొబ్బిలిలో ఆర్‌ఎస్ఎస్ ర్యాలీ


కవాతు చేస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

బొబ్బిలి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ హెడ్గేవర్ జయంతిని పురస్కరించుకుని బొబ్బిలి పట్టణంలో ఆదివారం సాయంత్రం ఆ సంస్థ కార్యకర్తలు కవాతు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రతినిధి పెంట స్వామి నాయుడు ఆధ్వర్యంలో సరస్వతీ శిశుమందిర్‌లో సమావేశం నిర్వహించారు. సీనియర్ న్యాయవాది పాణిగ్రాహి తదితరులు పాల్గొని, ప్రసంగించారు.

## ఉదయం పొగమంచు.. మధ్యాహ్నం ఠారెత్తిస్తున్న ఎండ

పార్వతీపురంటౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆదివారం ఉదయం దట్టంగా పొగమంచు కురిసింది. ప్రభుత్వ జూనియర్ క్రీడా మైదానంలో పొగమంచు కురవడంతో వాకర్స్‌కు ఇబ్బందిగా మారింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒక్కసారి ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. పగటి పూట ఉష్ణోగ్రతలు 40 సెంటీగ్రేడ్‌లు దాటాయి. ● భామిని, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భామిని ప్రాంతంలో ఆదివారం ఉదయం చినుకుల్లా తేనెమంచు కురిసింది. తెల్లవారుజామున తేనెమంచు.. మధ్యాహ్నం భానుడు ప్రతాపం చూపడంతో ఇప్పటికే జీడి, మామిడి పూతలు మాడిపోయాయని రైతులు వాపోతున్నారు.


భామిని ప్రాంతంలో కురుస్తున్న పొగమంచు